క్లుప్తంగా

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీరామమూర్తి తదితరులు

జి.సిగడాం: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి కోరారు. ఈ మేరకు రైతులతో కలిసి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన మీకోసం గ్రీవెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా సుమారుగా 4వేల క్వింటాళ్ల ధాన్యం అమ్మకాలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సంబంధిత మిల్లులకు టార్గెట్లు ఇవ్వాలని విన్నవించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు.

35 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఐఎంసీ చైర్మన్ ఎంవీఆర్ మూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో సోమవారం అప్రెంటీస్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 143 మంది ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 59 ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 35 మంది మాత్రమే అర్హత సాధించారు. కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ ఎంవీఆర్ మూర్తి, శ్యాం క్రిగ్ పిస్టన్ హెచ్‌ఆర్ ఆదినారాయణ, నాగార్జున అగ్రికెం నుంచి లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారి బీవీవీసీ కామేశ్వరరావు హాజరయ్యారు.

మెడికల్ క్యాంప్‌కు అనూహ్య స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చౌదరి పురుషోత్తమనాయుడు

శ్రీకాకుళం అర్బన్: ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌కు అనూహ్య స్పందన లభించింది. నగరంలోని ఎన్జీవో హోంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మంది రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తమనాయుడు మెగావైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.సోమసుందరరావు, రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాష్‌రావు, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి పీఎస్ ప్రసాదరావు, కోశాధికారి కె.వెంకటేశ్వరరావు, జిల్లా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



వేషధారణల్లోని విద్యార్థులతో సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని హయాతీనగరంలో ఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే ఏపీ వెనుకబడిన గురుకుల బాలికల పాఠశాలలో సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక సందర్శన



ఎంఈవో కార్యాలయం వద్ద డీఈవో తిరుమల చైతన్య

రణస్థలం: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయాన్ని డీఈవో డాక్టర్ తిరుమల చైతన్య సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పునర్వవస్థీకరణలో భాగంగా పాఠశాలల విలీనం శతశాతం పూర్తి కావాలన్నారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్యలు పరిష్కారించాలని సూచించారు. 2 కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలు విలీనమైతే రవాణా సౌకర్యం కల్పిస్తామనే విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య పాల్గొన్నారు.

స్వర్ణ కిరీటానికి విరాళం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డీసీసీబీ కాలనీలో వేంచేసిన భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వేంకటేశ్వర స్వామివారికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం జావాన సురేష్‌కుమార్, రూప దంపతులు 10 గ్రాముల బంగారం విరాళంగా సోమవారం అందించినట్లు అర్చకులు గోపాలాచార్యులు తెలిపారు.

డోలోత్సవానికి వేళాయె..!



పుష్పాలంకరణలో శ్రీకూర్మనాథుని మూలవిరాట్

- రేపటి నుంచి శ్రీకూర్మనాథుని డోలోత్సవం
- తొలిరోజు కామదహనోత్సవం
- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథుని డోలోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 12వ తేదీ నుంచి ఉత్సవాలు చేపట్టనున్నారు. దీనిలో భాగంగా తొలిరోజు రాత్రి కామదహనోత్సవం, మరుసటి రోజు సముద్ర స్నానాలు (పడియ), 14న శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి డోలో మంటపంలో ఉత్తరాభిముఖంగా భక్తులకు దర్శనమివ్వడంతో ఈ ఉత్సవం పూర్తికానుంది. ప్రతిఏటా ఫాల్గుణ శుద్ధ త్రయోదశి నాడు మాఘ నక్షత్రంలో జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తారు. తొలిరోజు స్వామి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై తిరువీధిగా తీసుకెళ్లి, ఆలయ సమీపంలోని కామదహన మంటపం వద్ద కామదహనోత్సవం వైదికంగా నిర్వహిస్తారు. తర్వాతి రోజు పడియలో భాగంగా సముద్ర, శ్వేత పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలాచరించి కూర్మనాథుని దర్శనం చేసుకుంటారు. ఉత్సవం చివరి రోజున దేవాలయ పొలిమేరలోని డోలో మంటపంలో ఊయల ఉత్సవంలో భాగంగా శ్రీకూర్మనాథుడు భక్తులకు ఉత్తరాభిముఖంగా దర్శనమివ్వగా, అక్కడ బుక్కా, భర్గుండతో స్వామిపూజ జరుగుతోంది. ఆరోజు శ్రీకూర్మనాథుని ఉత్సవమూర్తి పాదాలు తాకే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తారు. ప్రసాదంగా బుక్కా, భర్గుండను భక్తులకు అందజేస్తారు. దీంతో డోలోత్సవ యాత్ర ముగియనుంది.

అస్థికల నిమజ్జనంతో ముక్తి

ఈ క్షేత్రంలోని శ్వేత పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేయడంతో పాటు మానవ దేహ అస్థికలు నిమజ్జనం చేయడం వలన ముక్తి కలుగుతుందని శాస్త్రవచనం. దీని ఆధారంగానే ఇక్కడ కూర్మగుండం అనే పేరుతో పిలవబడే ఆలయం ఎదురుగా ఉన్న పుష్కరిణిలో అస్థికలు కలుపుతారు. అందుకే పితృమోక్ష కారక క్షేత్రంగా ఇది పిలవబడుతోంది.



శ్రీకూర్మనాథుని ప్రధాన ఆలయం

ఏర్పాట్లు పూర్తి

శ్రీకూర్మనాథుని డోలోత్సవంలో భాగంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఇన్‌చార్జి ఈవో జి.గురునాథరావు తెలిపారు. వాహనాలను సిద్ధం చేయడంతో పాటు శ్వేతపుష్కరిణిలో స్నానాల రేవును సిద్ధం చేస్తున్నామన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్ఐ ఆర్.జనార్ధనరావు వెల్లడించారు.

తక్షణమే పెన్షన్ మంజూరు చేయాలి



ధర్నా చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో డబ్బులు చెల్లించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు తక్షణమే హయ్యర్ పెన్షన్ మంజూరు చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శంకరరావు(సుమన్) అధ్యక్షతన సమావేశం సోమవారం నిర్వహించారు.

అదేవిధంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సామాజిక పెన్షన్ కోసం భారీ ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ఆర్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.అప్పారావు మాట్లాడుతూ సామాజిక పెన్షన్ కోసం ఇటీవల ఎమ్మెల్యేలకు వినతులు అందజేసినట్లు గుర్తుచేశారు. అలాగే రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈనెల 14వ తేదీన విజయవాడలో ధర్నాచౌక్ వద్ద విశ్రాంత ఉద్యోగులతో చేపడుతున్న ధర్నాకు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 5 డిపోల పరిధిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులందరూ హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు సుమన్, పెంటయ్య, జామి ప్రసాద్, రాజు, సత్యం, జి.ప్రసాద్, రమన, రామారావు, మాధవ, చిన్నారావు, మల్లేసు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు విడనాడాలి



కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులపై ఆర్టీసీ యాజమాన్యం కక్ష సాధింపు చర్యలను విడనాడాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.త్రినాథ్, కె.దశరథలు స్పష్టం చేశారు. శ్రీకాకుళం రెండో డిపో యాజమాన్య చర్యలను నిరసిస్తూ శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వరుసగా రెండోరోజు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రైవర్, కండక్టర్ పోస్టులు 10 నెలలైనా ఫిల్ చేయలేదని, ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో సమస్యలు గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయడం లేదని వాపోయారు. తక్షణమే ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈయూ నాయకులు ఎస్వీ రమణ, వై.దుర్గారావు, ఆర్.వసంతరావు, ఎస్ఎస్ కుమార్, పి.రమణ, డి.వనజాక్షి, త్రివేణి, లక్ష్మణరావు, ఆనందరావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న డీఎం రామం

జి.సిగడాం: గ్రామాల్లో అర్హులైన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని నంది అవార్డు గ్రహీత ముళ్లపూడి రామచంద్రరావు కోరారు. మండల కేంద్రంలో మండల కళాకారుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులు డి.ఎం.రామం, పిన్నింటి నారాయణరావుల అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థాయిలో కళాకారులతో ప్రజలకు వివిధ రకాల అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ కళాకారుడికి సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

30న భజన పోటీలు

జి.సిగడాం మండల కేంద్రంలో ఈనెల 30న మండల స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు డి.ఎం.రామం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పోటీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నవారికి ప్రత్యేక బహుమతులను అందిస్తామన్నారు. పోటీలకు హాజరైన బృందాలకు వసతి, భోజన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు 63043 50985, 80082 54638, 80745 49240 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

జిల్లాలో జీరో పావర్టీ పీ-4 ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వర్ణాంధ్ర-2047 కార్యాచరణలో భాగంగా జీరో పావర్టీ పీ-4 విధానం అమలు ప్రక్రియ జిల్లాలో మొదలైందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ ప్రయాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్‌లోని పది సూత్రాల్లో మొదటి సూత్రమైన సంపూర్ణ పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానాన్ని ఉగాది నుంచి ప్రారంభించనుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, దాతలు, ప్రజా భాగస్వామ్యంతో పేదరికం లేని సమాజం లక్ష్యంగా ఈ పీ4 విధానం అమలుకానుందని ఆయన పేర్కొన్నారు. దీనిపై రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లింక్ ద్వారా ఈ నెల 25వ తేదీలోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. అభిప్రాయాలు/సూచనలు తెలియజేసిన వారిని ప్రశంసిస్తూ ఒక ప్రశంసాపత్రం కూడా వెబ్‌సైట్‌లో జెనరేట్ అవుతుందని వివరించారు.

న్యాయం చేయండి



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సమస్య వివరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గతేడాది డిసెంబర్ 31వ తేదీన విధుల నుంచి తొలగించిన తమకు న్యాయం చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదివరకే ఈ సమస్యలపై ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు. వర్సిటీ అధికారులు కక్షపూరితంగా తమను ఉద్యోగాల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

బెడ్‌సైట్ అసిస్టెంట్ కోర్సు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సాయి బృందావన మందిరంలో వయో వృద్ధులకు సేవలందించే బెడ్‌సైట్ అసిస్టెంట్ కోర్సును రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కోర్సు సేవా దృక్పథంతో కూడుకున్నది పేర్కొన్నారు. సత్యసాయి స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఆంధ్రరాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఈ కోర్సు ప్రారంభించామని తెలిపారు. ఈ శిక్షణ ఆరు నెలలపాటు రెసిడెన్షియల్‌గా ఉంటుందని, దీనికి ఓరల్ క్లాసులు, ల్యాబరేటరీ ద్వారా ప్రాక్టికల్స్ కూడా చేయిస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ధ్యేయమని ఆ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌వీ దుర్గారావు, కింతలి నాగేశ్వరరావులు అన్నారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, రోటరీ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మగ్గం, టైలరింగ్ శిక్షణ పొందిన సుమారు 50 మంది మహిళలకు ఆదివారం రాత్రి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కేటీ నాయుడు, వి.వైకుంఠరావు, బి.భరత భూషణ్, ఎ.చక్రపాణి, కేవీ కామేశ్వరరావు, జి.కన్నబాబు, ఎస్ఎస్‌మూర్తి, వసంతరావు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఓబీసీ జాబితాలో చేర్చాలి



నెమలపురి కోటేశ్వర చౌదరి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దశాబ్దాలుగా ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్న సొండి కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నెమలిపురి కోటేశ్వర చౌదరి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సొండి కులానికి సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో సుమారు 2 లక్షల మంది ఉన్నారని తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సుమారు లక్షకు పైగా తాము ఉన్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఓబీసీలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే తమ జాతి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాయచోటి అర్బన్ స్టేషన్ ఎస్ఐ నరసింహారెడ్డి హిందువులను కించపర్చేవిధంగా ప్రవర్తించిన తీరు అమానుషమని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్దనున్న డబ్ భవనం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడి వేణుగోపాల్, పూడి తిరుపతిరావు, శవ్వాన ఉమామహేశ్వరి, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

పాతపట్నంలో 12న జాబ్ మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్-ఎంటర్ ప్రైస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంయుక్తంగా 12న పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నాయి. ఈ మేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ కిరణ్ కుమార్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో సంక్యు ఇండియా, డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తాయని, సంక్యు ఇండియా కంపెనీ ప్యాకింగ్ - హెల్పర్స్ (65 ఖాళీలు) ఉద్యోగాలకు 7వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన 18-40 సంవత్సరాల వయస్సు గల పురుషులను ఎంపిక చేస్తుందని చెప్పారు. జీతం నెలకు రూ.12,000 ఉంటుందన్నారు. డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీ ట్రైనీ కెమిస్ట్ (50 ఖాళీలు) ఉద్యోగాలకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీజెడ్‌సీ విద్యార్హత కలిగిన 18-27 సంవత్సరాల వయస్సు గల పురుషులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీతం రూ.17వేలు వరకు వస్తుందన్నారు. ఈ ఉద్యోగ మేళా 12న ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాతపట్నంలో జరుగుతుందని, అభ్యర్థులు రేషన్ కార్డ్/ఆధార్ కార్డ్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బయోడేటాతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7989744612 నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.

అవగాహన



లావేరు మండలంలోని గురగుబిల్లి గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణపై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మండల పంచాయతీ విస్తరణ అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పి.భవానీ ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా కేటాయించిన బుట్టల్లో వేయాలని సూచించారు. పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

\- ఎచ్చెర్ల

సేంద్రియ ఉత్పత్తుల అమ్మకం



జి.సిగడాం తహసీల్దార్, ఎంపీడీవో, ఐకేపీ కార్యాలయాల ఆవరణలో సేంద్రియ వ్యవసాయంలో సాగుచేసిన కూరగాయలను సోమవారం విక్రయించారు. జగన్నాథవలస, సర్వేశ్వరపురం, మెట్టవలస, జి.సిగడాం గ్రామాల్లో పండించిన కూరగాయల అమ్మకాలు రైతులు చేపట్టారు. వీటిని ఉద్యోగులు కొనుగోలు చేశారు. సేంద్రియ ఉత్పత్తుల వలన ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

\- జి.సిగడాం

విద్యుత్ స్తంభంపై మంటలు



ఎచ్చెర్ల మండలంలోని చినరావుపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభంపై సోమవారం మంటలు వ్యాపించాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రావడంతో శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బందికి స్థానికులు సమాచారం ఇచ్చారు. నీలగిరి, సరుగుడు తోటలకు నిప్పు అంటకుండా మండల అగ్నిమాపక సిబ్బంది అదుపుచేయగా, విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ నిలుపుదల చేసి మరమ్మతులు చేపట్టారు.

\- ఎచ్చెర్ల క్యాంపస్

యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

రణస్థలం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల మాదిరిగానే, రాష్ట్రంలోని విద్యార్థులను మోసం చేసిందన్నారు. కాలేజీలకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను కాలేజీల నుంచి వెళ్లగొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేద పిల్లల జీవితాలతో ఆటలు ఆడుతోందని, దీనికి నిరసనగా ఈనెల 12వ తేదీన బుధవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రణస్థలం మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, యూత్ ప్రెసిడెంట్ దన్నాన హరి, మాజీ సర్పంచ్ మింది జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12న చేపట్టబోయే యువత పోరు పోస్టర్‌ను శ్రీకాకుళం నియోజకవర్గ నాయకులు ధర్మాన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఆరోజు ఉదయం కలెక్టరేట్ వద్దనున్న జ్యోతిరావుపూలే పార్కు వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, గొండు రఘురామ్, అంధవరపు సూరిబాబు, మెంటాడ స్వరూప్, మూకళ్ల తాతబాబు, చిట్టి జనార్ధనరావు, పీస గోపి, ముంజేటి కృష్ణ, సాధు వైకుంఠం, మార్పుపృథ్వీ, గుండ హరీష్, బగ్గు అప్పారావు, బాణాల గాంధీ, రావాడ జోగినాయుడు, శంకరావు, సీపాన రామారావు, కింజరాపు రమేష్, బారిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో శివాలయం నిర్మాణానికి గ్రామస్తులు సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన మీసాల సూరిబాబు తమ సొంత భూమిని దేవాలయం నిర్మాణం కోసం ఇటీవల కమిటీ సభ్యులకు అప్పగించారు. దీంతో వేదపండితులు భమిడిపాటి రంగబాబు సమక్షంలో భూమిపూజ నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని బొంతల కోడూరులో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీశ్వరరావులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంపూర్తిగా విడిచిపెట్టిన పనులు చేయమని క్షేత్రస్థాయి అధికారుల చుట్టు తిరుగుతున్నా కనీసం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

పశువులకు గాలికుంటు టీకాలు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని కొత్తకోట గ్రామంలో పాడి పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ సహాయకుడు ఎస్.రాము మాట్లాడుతూ.. పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయడం ఒక్కటే మార్గమన్నారు. పాడి రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సొసైటీ సమస్యను పరిష్కరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నరసన్నపేటకు చెందిన ది నరసన్నపేట కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సమస్యలు పరిష్కరించాలని సొసైటీ ప్రతినిధి చింతు రామారావు తదితరులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మీకోసం కార్యక్రమంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కొంతమంది టీడీపీ నాయకులు లబ్ధిదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వివరించారు. ఈ విషయంపై ఇదివరకే ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. వాస్తవాలను పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

శరవేగంగా రహదారుల పనులు



పనులను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీరాములు

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శరవేగంగా రహదారుల పనులు చేపడుతున్నామని పంచాయితీరాజ్ శాఖ డీఈఈ ఎస్.శ్రీరాములు తెలిపారు. మండలంలో వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, నిద్దాం, పాలఖండ్యాం గ్రామాల్లో చేపట్టుతున్న పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఏఈఈ సత్యనారాయణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, మండల సీనియర్ నాయకులు బూరాడ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వడగా గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.